
సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 23 । జూన్ । 2023



మామిడికి 'కల్తార్' కలవరం!

మామిడి తోటలకు కల్తార్ రసాయనం అతి వినియోగంతో మొదటికే మోసం తెచ్చే పరిస్థితి ఏర్పడుతోంది.

8లో



రూ.152 కోట్లతో ఏఎంసీలో వసతులు

ఏఎంసీలో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు.

8లో

మర్యాదపూర్వక కలయిక



సింధియా: విశాఖ పోర్టు అథారిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం. అంగముత్తు.. కోస్ట్‌గార్డ్ కమాండర్, అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఎస్.పరమేష్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

న్యూస్‌రీల్

మరిన్ని మైలురాళ్లు అధిగమించాలి

క్రికెటర్ భరత్‌కు కలెక్టర్ అభినందన



భరత్‌ను అభినందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో వీడీసీఏ ప్రతినిధులు

విశాఖ స్పోర్ట్స్: నగరం నుంచి అంతర్జాతీయ టెస్ట్ క్రికెటర్‌గా ఎదిగిన కె.ఎస్.భరత్‌ను కలెక్టర్ ఎ.మల్లికార్జున అభినందించారు. వీడీసీఏ ప్రతినిధులతో కలిసి భరత్ గురువారం కలెక్టర్‌ను అతని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భరత్‌ను కలెక్టర్ మల్లికార్జున అభినందించి క్రికెట్‌లో మరిన్ని మైలురాళ్లను అధిగమించి విజయాలు సొంతం చేసుకోవాలన్నారు. వైజాగ్ నుంచి టెస్ట్ క్రికెట్ ఆడిన మొదటి వ్యక్తి కావడం, రంజీల్లో ట్రిపుల్ సెంచరీ చేసిన మొదటి వికెట్ కీపర్ బ్యాటర్ కావడం గర్వించదగ్గ విషయమన్నారు. వీడీసీఏ ఉపాధ్యక్షుడు డి.ఎస్.వర్మ, కార్యదర్శి కె.పార్థసారధి, కోచ్ కృష్ణారావు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

నేడు వైభవుడికి మాజీ ఉపరాష్ట్రపతి పూజలు



మురళీనగర్: మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం దర్శించుకుంటారని ఆలయ ఈవో బండారు ప్రసాద్ గురువారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఆయన వైభవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారని ఈవో తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖలో 69 మందికి బదిలీ



మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖ జోన్ వన్ పరిధిలో గురువారం మల్టీ పర్పస్ హెల్త్ సర్వీస్(ఎంపీహెచ్ఎస్-మేల్), మల్టీ పర్పస్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఎంపీహెచ్ఈవో)లకు కౌన్సెలింగ్ జరిగింది. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ ఉత్తరాంధ్ర జిల్లాలోని ఉద్యోగులకు బదిలీలు చేపట్టారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆదేశాల ప్రకారం ఏపీజీఈఏ ఆఫీస్ బేరర్లకు రిటెన్షన్(వారి స్థానంలోనే ఉండిపోవడం) అవకాశం ఇచ్చారు. ఎంపీహెచ్(మేల్) క్యాడర్‌లో 9 మంది, ఎంపీహెచ్ఈవో క్యాడర్‌లో 10 మంది రిటెన్షన్ పొందారు. మొత్తంగా గురువారం ఎంపీహెచ్(మేల్)లో 38 మంది, ఎంపీహెచ్ఈవోలో 31 మందికి బదిలీలు జరిగాయి.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ముగిసిన ఎంపికలు

విశాఖ స్పోర్ట్స్: డాక్టర్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి గురవారం పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో బ్యాటరీ టెస్ట్‌లు నిర్వహించారు. నాలుగు, ఐదో తరగతుల్లో ప్రవేశానికి ఈ ఎంపికలను జిల్లా స్థాయిలో నిర్వహించగా 40 మంది చిన్నారులు పాల్గొన్నారు. వీరందరికి బ్యాటరీ టెస్ట్‌ల్లో భాగంగా ఎత్తు, బరువు, ఫిజికల్ మెజర్‌మెంట్స్‌తో పాటు పరుగు, జంపింగ్, త్రో అంశాలను నిర్వహించారు. జిల్లాకు ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయికి పంపనున్నారు. రాష్ట్ర స్థాయిలో నాలుగో తరగతిలో 20 మంది బాలురు, 20 మంది బాలికలకు ప్రవేశం కల్పించనున్నారు. ఐదో తరగతిలో బాలురకు ఏడు, బాలికలకు నాలుగు సీట్లు ఖాళీలున్నాయి. నాలుగో తరగతిలో ప్రవేశానికి 8-9 ఏళ్ల మధ్య వయస్కులు అర్హత పోటీల్లో పాల్గొనగా ఐదో తరగతిలో ప్రవేశానికి 9-10 ఏళ్ల మధ్య బాల బాలికలు పోటీపడ్డారు. తొలుత ఎంపికల్లో పాల్గొనేందుకు వచ్చిన చిన్నారుల పత్రాల పరిశీలన జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగింది.

జాయింట్ ఆప్షన్ ఫారాలు ఆన్‌లైన్‌లోనే పంపించండి

మురళీనగర్: హయ్యర్ వేజ్ పింఛన్ కోసం సభ్యులు, పెన్షనర్లు జాయింట్ ఆప్షన్ ఫారాలు ఆన్‌లైన్‌లోనే పంపించాలని రీజినల్ పీఎఫ్ కమిషనర్-2 కె.వీరమణికాంత్ ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఇప్పటికీ చాలా మంది మాన్యువల్‌గా కార్యాలయానికి వచ్చి ఫారాలు ఇస్తున్నారని.. ఇవి పరిగణలోకి తీసుకోమని చెప్పారు. ఈపీఎఫ్ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీ నుంచి వచ్చిన ఉత్తర్వులను అనుసరించి ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ 1995కు సంబంధించిన పింఛనుదారులు, సభ్యులు అధిక పింఛను కోసం యాజమాన్యంతో కలిపి జాయింట్ ఆప్షన్ ఫారాలను ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. ఇందుకోసం https:// unifiedportal&mem.epfindia.gov.in/memberinterface/ ను సందర్శించాలన్నారు.

రాజప్రాసాదంలా రైల్వే స్టేషన్



విశాఖపట్నం రీ డెవలప్‌మెంట్ డిజైన్లు

ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలతో పాటు వాణిజ్య అవసరాలకు అనుగుణంగా విశాఖ రైల్వే స్టేషన్ అభివృద్ధి చేసేందుకు రైల్వే ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్ఎల్డీఏ) చర్యలు చేపట్టింది. రూ.456 కోట్లతో రైల్వే స్టేషన్ రూపురేఖలను మారుస్తూ.. రాజప్రాసాదంలా తీర్చిదిద్దే పనులు చురుగ్గా సాగుతున్నాయి.

- చురుగ్గా విశాఖ రైల్వేస్టేషన్ రీడెవలప్‌మెంట్ పనులు
- రూ.456 కోట్లతో పనులు ప్రారంభించిన రైల్వే బోర్డు
- కొత్తగా జ్ఞానాపురం వైపు రెండు ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటుకు ప్రణాళికలు
- 32 ఎస్కలేటర్లు, 20 లిఫ్ట్‌లు ఏర్పాటు చేసేలా డిజైన్

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందించడంతో పాటు.. స్టేషన్‌లో అత్యాధునిక వ్యవస్థల్ని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రాజెక్టు పనులు సాగుతున్నాయి. అప్‌గ్రేడేషన్ చేసే స్టేషన్‌లో అత్యాధునిక స్కైవాక్‌లతో.. స్టేషన్‌కు వచ్చి రైలు ఎక్కేంత వరకూ అత్యంత సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయనున్నారు. స్టేషన్ డిపార్చర్ హాల్‌ను కలుపుతూ రూఫ్ ప్లాజా, సాధారణ వెయిటింగ్ ఏరియా కలిగి, ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేసేలా విభిన్న డిజైన్లతో ప్లాట్‌ఫాంలను నిర్మించనున్నారు. ఒక సాధారణ ప్రయాణికుడు రైల్వే స్టేషన్‌కి వస్తే ఎలాంటి ఇబ్బంది ఎదురవ్వకుండా అత్యాధునిక మాల్‌కి వచ్చినట్లుగా ఎంజాయ్ చేస్తూ వెళ్లేలా స్టేషన్ రూపు రేఖలు మారిపోనున్నాయి. ఇందుకోసం రీడెవలప్‌మెంట్ పనులను రూ.456 కోట్లతో కొద్ది నెలల క్రితం ప్రారంభించారు.

రూపురేఖలు మారనున్న జ్ఞానాపురం ఎంట్రన్స్

రైల్వే స్టేషన్ అభివృద్ధిలో భాగంగా ఎనిమిదో నంబర్ ప్లాట్‌ఫాం ఉన్న జ్ఞానాపురం ప్రాంత ఎంట్రన్స్ పూర్తిగా రూపురేఖల్ని మార్చేసుకోనుంది. తొలి విడతలో భాగంగా జ్ఞానాపురం వైపు పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఎనిమిది ప్లాట్‌ఫామ్‌లుండగా.. అదనంగా మరో రెండు నిర్మించనున్నారు. మొత్తం 10 ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి రావడం వల్ల.. అవుటర్‌లో ప్లాట్‌ఫాంల కోసం రైళ్ల నిరీక్షించే అవస్థలు చాలా వరకు తగ్గుతాయి. ప్రస్తుతం విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి రోజుకు 110 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇందులో 37 రైళ్లు ఇక్కడి నుంచే బయలుదేరుతున్నాయి. రీడెవలప్‌మెంట్ జరిగిన తర్వాత 10 ప్లాట్‌ఫామ్‌ల నుంచి రోజుకు అదనంగా మరో 20 రైళ్లు రాకపోకలు సాగించే అవకాశం ఉంది. 8వ నంబర్ ప్లాట్‌ఫాం వైపు ఉన్న ప్రవేశ ద్వారం పరిసరాల్లో పెద్ద పెద్ద చెట్లను తొలగించి.. భూమిని చదును చేస్తున్నారు. అదేవిధంగా.. ఈ వైపు ఉన్న నాలుగో నంబర్ గేటు నుంచి రాకపోకలు నిలిపివేశారు. అంటే 8వ నంబర్ ప్లాట్‌ఫాంవైపు వెళ్లాలంటే.. 5వ నంబర్ గేట్ నుంచి వెళ్లాలి. ప్లాట్ ఫాంల కొలతల ప్రక్రియను ఇంజినీరింగ్ సిబ్బంది పూర్తి చేశారు. ప్లాట్‌ఫాంల అభివృద్ధితో పాటు జ్ఞానాపురం మార్గం కూడా చాలా అద్భుతంగా మారిపోనుంది.

మెయిన్ ఎంట్రన్స్ అదరహో..

ఇక మెయిన్ ఎంట్రన్స్ అత్యాధునికంగా మార్పు చెందనుంది. ప్రస్తుతం ఉన్న ఎంట్రన్స్‌ను రాజప్రాకారంలా తీర్చిదిద్దనున్నారు. దీనికి సంబంధించిన డిజైన్లను రైల్వే మంత్రిత్వ శాఖ ఇప్పటికే బహిర్గతం చేసింది. ప్రయాణికులను సాగనంపేందుకు వచ్చే వారి వాహనాల పార్కింగ్ కోసం మల్టీ లెవల్ కార్ పార్కింగ్ రానుంది. ఈ ఎంఎల్‌సీపీలో వాణిజ్య సముదాయాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. స్టేషన్‌లో ఐవోటీ ఆధారిత స్మార్ట్ పార్కింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు చేయనున్నారు. డిజిటల్ సైనేజ్ ద్వారా పార్కింగ్ స్థలాన్ని సులభంగా గుర్తించుకునేలా సిస్టమ్‌ని అభివృద్ధి చేస్తారు. అదేవిధంగా స్టేషన్‌లో రిటైరింగ్ రూమ్‌లు, మెడికల్ ఎమర్జెన్సీ రూమ్, రిటైల్, ఆఫీస్ స్పేస్‌లు, ప్రయాణికుల లగేజీ కోసం ప్రత్యేక క్లోక్ రూమ్ రానున్నాయి.

75 వేల మంది రాకపోకలకు అనుగుణంగా..



జ్ఞానాపురం వైపు కొనసాగుతున్న పనులు

వాల్తేరు డివిజన్ ప్రధాన కేంద్రమైన విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి ప్రతి రోజూ 45 నుంచి 50 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనులు పూర్తయ్యాక 75 నుంచి 90 వేల మంది రాకపోకలు సాగించేందుకు వీలుంటుంది. ప్రయాణికుల కోసం 32 ఎస్కలేటర్లు, వృద్ధులు, దివ్యాంగ ప్రయాణికుల కోసం 20 లిఫ్ట్‌లు ఏర్పాటు కానున్నాయి.

సామాన్య ప్రయాణికులకు సౌకర్యవంతంగా..



విశాఖపట్నం రైల్వే స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనులకు శ్రీకారం చుట్టాం. రాబోయే రోజుల్లో విశాఖపట్నం కీలకంగా మారనున్న నేపథ్యంలో ప్రయాణికుల భద్రత, వారికి కావల్సిన సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యం. ఈ పనుల్ని ఉన్నతాధికారులు డిజైన్ చేశారు. సామాన్య ప్రయాణికుడు కూడా సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేలా అభివృద్ధి జరగనుంది. ఈ పనులు పూర్తయితే విశాఖ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారిపోతాయి.

– అనూప్‌కుమార్ సత్పతి, వాల్తేరు డీఆర్ఎం

విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం: అరకు వెళ్లే ప్రయాణికులు, పర్యాటకుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం రైలుకు ఆయా తేదీల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ రైలుకు జూలై 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, 30 తేదీల్లోను, కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలుకు జూలై 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, 31 తేదీల్లో మరో విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు. మరింత మంది ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని అరకు అందాలను అద్దాల కోచ్‌ల నుంచి వీక్షించవచ్చని తెలిపారు.

పూరీ రథయాత్రకు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: పూరీలో జరగనున్న జగన్నాథ రథయాత్రకు మరికొన్ని ప్రత్యేక రైళ్లు ఆయా తేదీల్లో నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. కాచిగూడ-ఖుర్దారోడ్ (07223) రథయాత్ర స్పెషల్ కాచిగూడలో ఈనెల 24వ తేదీ రాత్రి 8.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.20 గంటలకు బయల్దేరి అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు ఖుర్దారోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఖుర్దారోడ్-కాచిగూడ (07224) స్పెషల్ ఖుర్దారోడ్‌లో ఈనెల 25వ తేదీ ఆదివారం సాయంత్రం 6.30గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 2 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 2.02 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 4 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది.

నేడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాక

మహారాణిపేట: కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి శుక్రవారం విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో ఉదయం 10.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. నేరుగా రుషికొండలోని ఎ-వన్ కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు అక్కడే ఉంటారు. సాయంత్రం 4.25 గంటలకు విమానంలో హైదరాబాద్ వెళతారు.

వార్డులపై పూర్తి అవగాహన అవసరం

- పోలీస్ శాఖలో మహిళా పోలీసులు భాగం
- శాంతిభద్రతల్లో మీ తోడ్పాటు అవసరం
- నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ



మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి(విశాఖ దక్షిణ): ప్రశాంత వాతావరణంలో విశాఖ మరింత అభివృద్ధి సాధించేందుకు మహిళా పోలీసుల కృషి, తోడ్పాటు అవసరమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ పేర్కొన్నారు. గురువారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో మహిళా పోలీసుల(వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు)తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 500 మందికిపైగా ఉన్న మహిళా పోలీసులు పోలీస్ శాఖలో భాగమని తెలిపారు. వార్డులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, మహిళలపై, పిల్లలపై ఎటువంటి దాడులు, మోసాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మహిళా పోలీసులపై ఉందని సూచించారు. వీరికి సంబంధిత పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది ఎల్లవేళలా అండగా ఉంటారని పేర్కొన్నారు. సంబంధిత పోలీస్ వాట్సాప్ గ్రూప్‌లో యాక్టివ్‌గా ఉంటూ ముఖ్య సమాచారాన్ని పంచుకోవాలని, అవసరం మేరకు ఉన్నతాధికారులతో కూడా నేరుగా తమ సమస్యలను తెలియజేయవచ్చని చెప్పారు. అలాగే సైబర్ నేరాలు, దిశా యాప్, యాంటీ డ్రగ్ వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వారి పరిధిలో కుటుంబ కలహాలు కారణంగా ఆత్మహత్యలు, హత్యలు జరగకుండా సదరు కుటుంబాలకు అవసరమైన కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులను గమనిస్తూ చెడు వ్యసనాల జోలికి పోకుండా, ముఖ్యంగా బాలికలు, స్త్రీలకు ఉమెన్ సేఫ్టీపై అవగాహన కల్పించాలన్నారు. విధులలో ప్రతిభ చూపించిన మహిళా పోలీసులను అభినందిస్తూ, ఇటువంటి వారికి ప్రశంసా పత్రాలు, క్యాష్ రివార్డులు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ-2 ఆనందరెడ్డి, డీసీపీ(క్రైం) నాగన్న, ఏడీసీపీ గంగాధరం ఏడీసీపీ(ఎస్‌బీ) నాగేంద్ర, ఏసీపీ(దిశ) వివేకానంద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు విశాఖలో ప్రాంతీయ వ్యవసాయ సమావేశం

మహారాణిపేట: దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ప్రాంతీయ వ్యవసాయ ఖర్చుల, ధరల కమిషన్ ప్రాంతీయ సమావేశం శుక్రవారం విశాఖలో నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షదీప్‌కు చెందిన వ్యవసాయ అధికారులు పాల్గొంటారు. 2024-25లో రబీ కాలంలో ధాన్యం, గోధుమ, బార్లీ పంటలు, అపరాల కింద శనగ, లెంటిల్ పంటలు, నూనె గింజల కింద ఆవాలు, కుసుమ పంటల సాగు ఖర్చు, ఉత్పాదక ఖర్చులను పరిగణలోనికి తీసుకొని కనీస మద్దతు ధరను ఆయా రాష్ట్రాలు ప్రతిపాదిస్తాయి.

ఈ-క్రాప్ బుకింగ్ : ఈ క్రాప్ ద్వారా ఖరీఫ్, రబీ, వేసవి పంట కాలాల్లో విత్తన పంటను డిజిటల్ పద్ధతిలో నమోదు చేయబడుతుంది. ఈ-క్రాప్ ఆధారంగా పౌర సరఫరాల శాఖ, ఏపీ మార్క్‌ఫెడ్, ఏపీ ఆయిల్ ఫెడ్ మొదలైన ఏజెన్సీల ద్వారా కనీస మద్దతు ధరకు వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా, వ్యవసాయ, అనుబంధ శాఖల ఇన్‌పుట్ సబ్సిడీ పథకాలు, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి అప్పలస్వామి తెలిపారు.

సింహగిరి ప్రదక్షిణకు పక్కా ఏర్పాట్లు

గిరి ప్రదక్షిణ మార్గంలో కలెక్టర్, సీపీ పర్యటన



లుంబినీ పార్కు వద్ద సూచనలు చేస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ. చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సింహాచలం/డాబాగార్డెన్స్: వచ్చే నెల 2న జరిగే సింహగిరి ప్రదక్షిణ మార్గంలో కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, దేవస్థానం ఈవో భ్రమరాంబ ఆయా శాఖల అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. ఆ రోజు సింహగిరి చుట్టూ 32 కిలోమీటర్ల మేర భక్తులు ప్రదక్షిణ చేయనున్న సంగతి తెలిసిందే. ప్రదక్షిణ మార్గంలో భక్తుల సౌకర్యార్థం చేయాల్సిన ఏర్పాట్లపై బుధవారం కలెక్టర్ మల్లికార్జున అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో గిరి ప్రదక్షిణ మార్గంలో పర్యటించారు. భక్తులు ప్రదక్షిణ చేసే మార్గంలో ప్రతీ పాయింట్‌ను పరిశీలించారు. ఆయా పాయింట్లలో చేయాల్సిన ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు, మౌలిక సదుపాయాలు, మజ్జిగ, మంచినీరు పంపిణీ, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. రోడ్లు, విద్యుద్దీపాలు, తాగునీరు, మొబైల్ మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణపై సూచనలిచ్చారు. జోడుగుళ్లపాలెం తీరంలో భక్తులు స్నానాలు చేసేందుకు, మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆదేశాలిచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేసి గిరి ప్రదక్షిణను విజయవంతం చేయాలన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, సింహాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరాజు, పట్టణ ప్రణాళికాధికారి సునీత, జీవీఎంసీ అధికారులు, పోలీస్ యంత్రాంగం, రెవెన్యూ, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కమిషనర్ శైలి విభిన్నం



'జగనన్నకు చెబుదాం'లో మేయర్‌తో కలిసి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ(ఫైల్)

డాబాగార్డెన్స్: జీవీఎంసీకి ఎందరో కమిషనర్లు వచ్చారు. వీరిలో కొందరు పదోన్నతులపై వెళితే.. బదిలీలపై వెళ్లిన వారు ఇంకొందరు. ఆయా కమిషనర్లు జీవీఎంసీ అభివృద్ధికి తమదైన శైలిలో చర్యలు చేపట్టారు. అయితే ప్రస్తుత కమిషనర్ సాయికాంత్ వర్మ శైలి మాత్రం కాస్త విభిన్నం. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సాయికాంత్ వర్మ తనదైన శైలిలో విధులు నిర్వర్తిస్తున్నారు. ముఖ్యంగా జగనన్నకు చెబుదాం(స్పందన)లో వచ్చే ఫిర్యాదులు, నేరుగా కమిషనర్‌కు అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తున్నారు. సమస్య ఎక్కడ ఉందో నేరుగా అక్కడకే వెళ్తున్నారు. సమస్య ఏ మేరకు ఉందో గుర్తించి ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్నారు. తర్వాత ఆయా జోనల్ అధికారులు, శానిటరీ సిబ్బంది, సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి అక్కడకు రప్పిస్తున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ముందస్తు సమాచారం ఇస్తే వాస్తవ పరిస్థితి తెలుసుకునే అవకాశం ఉండదు. అందుకే కమిషనర్ ఈ పంథాను అనుసరిస్తున్నారు. నగరాభివృద్ధి విషయంలో కూడా కమిషనర్ తనదైన శైలిలో వ్యవహరిస్తున్నారు. గతంలో జరిగిన అభివృద్ధి, ఇంకా జరగాల్సిన అభివృద్ధిపై సంబంధిత ప్రాంతానికి వెళ్లడం, అక్కడకు ఉన్నతాధికారులను రప్పించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడం ఈ కమిషనర్ స్టైల్.



జగదాంబ జంక్షన్ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై ఆరా తీస్తున్న కమిషనర్ (ఫైల్)

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

డాబాగార్డెన్స్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని నగర ప్రజలకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ విజ్ఞప్తి చేశారు. వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధుల వ్యాప్తితో పాటు దోమలు వృద్ధి చెందుతాయని, వాటి నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి పరిసరాలు, కొబ్బరి బొండాలు, ఖాళీ సీసాలు, ఫ్రిజ్ వెనుక భాగంలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమ తెరలు ఉపయోగించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని పిలుపునిచ్చారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, జ్వరం వచ్చిన వెంటనే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ఇంటింటా సర్వే చేపట్టండి

మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, వార్డు సచివాలయ హెల్త్ కార్యదర్శులు.. వలంటీర్ల సహకారంతో ఇంటింటా సర్వే చేపట్టి.. సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ ఆదేశించారు. కాలువల్లో మురుగు నీరు నిల్వ లేకుండా పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయడంతో పాటు ఫాగింగ్ చేయాలన్నారు. ఈ ఏడాది డెంగ్యూ కేసుల నమోదు కాకుండా సమన్వయంతో పని చేయాలన్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు

డాబాగార్డెన్స్ : టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథస్వామి కూర్మావతారంలో గురువారం దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామికి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 గంటల వరకు నిత్యపూజ, 7 నుంచి 9.30 గంటల వరకు జగన్నాథస్వామి ప్రార్థన సంఘంచే ప్రార్థన తరంగిణి, 9.30 నుంచి 10.30 వరకు సామూహిక లలితా సహస్రనామ పారాయణం, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం, 5 నుంచి 6 గంటల వరకు అక్కినపల్లి రాధా ప్రసాదాచార్యులచే ధార్మికోపన్యాసం నిర్వహించారు. సాయంత్రం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు మనోరంజని మ్యూజిక్ స్కూల్ శారదచే అన్నమయ్య సంకీర్తనలు, సాయంత్రం 7.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు మయూరి డ్యాన్స్ అకాడమీ ప్రతినిధి ఉషానాయుడు సారథ్యంలో ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. శుక్రవారం జగన్నాథస్వామి వరహావతారంలో దర్శనమివ్వనున్నారని ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

దేశంలో వ్యాపార రంగం పరుగులు

ఎంపీ మనోజ్ కొటక్



మాట్లాడుతున్న ఎంపీ మనోజ్ కొటక్

బీచ్‌రోడ్డు : ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశంలో వ్యాపార రంగం అభివృద్ధిలో పరుగులు తీస్తోందని ఎంపీ మనోజ్ కొటక్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం విశాఖ వ్యాపారవేత్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రదాడులు లేని దేశంగా భారత్ ఉండడం మోదీ ఘనతేనన్నారు. వ్యాపారులకు కావాల్సిన సదుపాయాలు అందిస్తున్నామని, అందుకు అనుగుణంగా జీ 20 సదస్సులో ఎన్నో పెట్టుబడు లు రావడం దేశ ప్రగతికి నిదర్శనమన్నారు. కరోనా విపత్కర సమయంలో ప్రపంచ దేశాలన్నీ ఆర్థికంగా కుదేలైతే భారతదేశ ఆర్థిక వ్యవస్థ మాత్రం రెండింతలు వృద్ధి సాధించిందన్నారు. ఇందులో వర్తకుల పాత్ర ఎంతో ఉందన్నారు. 2014కు ముందు 90 శాతం ఫోన్లను దిగుమతి చేసుకునేవాళ్లమని, ఇప్పుడు ప్రపంచంలోనే మొబైల్స్ తయారీలో రెండో స్థానంలో భారత్ నిలిచిందన్నారు. తొమ్మిదేళ్ల మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందని చెప్పారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎస్ మాధవ్, ఉత్తరాంధ్ర ఇంచార్జి వి.సూర్యనారాయణ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

• ఉదయం 6 గంటలకు బీచ్‌రోడ్డు ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి చిల్డ్రన్ పార్కు వరకు ఒలింపిక్ డే రన్ • ఉదయం 10 గంటలకు పార్క్ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సెమినార్ • ఉదయం 11 గంటలకు జిల్లా కోర్టు ఆవరణలో రైట్స్ ఆఫ్ ట్రాన్స్‌జెండర్స్ అనే అంశంపై అవగాహన

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.59,450
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.54,500
వెండి(కిలో):	రూ.75,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.145
స్కిన్	: రూ.270
స్కిన్‌లెస్	: రూ.280

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	550.00
విజయనగరం	554.00
శ్రీకాకుళం	554.00

జ్ఞానానంద ఆశ్రమం వద్ద బందోబస్తు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం వద్ద గురువారం నుంచి ఎంవీపీ పోలీస్‌స్టేషన్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు పూర్ణానంద(పున్నయ్య) స్వామీజీకి కోర్టు జూలై 5వ వరకు రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఏపీ సాధు పరిషత్, బీజేపీ, పలు విద్యార్థి, యువజన, మహిళా, ధార్మిక సంఘాలు ప్రతినిధులు ఇక్కడ ఆందోళనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు భద్రత చర్యలు చేపట్టారు.

మామిడికి 'కల్తార్' కలవరం

• అధిక దిగుబడి కోసం అతిగా వినియోగం
• ఉత్పత్తి పెరిగినా తగ్గిపోతున్న చెట్ల జీవితకాలం
• ఇప్పటికే ఉమ్మడి విశాఖ జిల్లాలో 60 శాతానికి పైగా వాడకం
• అతిగా వాడకం అనర్థమంటున్న ఉద్యానశాఖ అధికారులు



మామిడిచెట్టుకు కల్తార్‌ను స్ప్రే చేస్తున్న దృశ్యం

సాక్షి, విశాఖపట్నం: కల్తార్.. కొంతకాలంగా మామిడి రైతులు, వ్యాపారుల్లో బాగా నానుతున్న పదం. మామిడిలో అధిక దిగుబడి కోసం ఉద్దేశించిన ఈ రసాయనం ఇప్పుడు అతి వినియోగంతో మొదటికే మోసం తెచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. గ్రోత్ హార్మోన్లను పెంచి మామిడి నాణ్యత పెరగడానికి, ఎక్కువ దిగుబడి సాధించడానికి ప్యాక్లోబుట్రాజోల్ అనే ఈ రసాయన ఎరువు బాగా ఉపయోగపడుతోంది. మామూలుగా మామిడి చెట్టు 20 ఏళ్ల వరకు దానంతట అదే మంచి దిగుబడిని ఇస్తుంది. ఆ తర్వాత దిగుబడి తగ్గుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని 20 ఏళ్ల పైబడిన చెట్లకు కల్తార్‌ను సీజనుకు ఒకసారి మాత్రమే పరిమిత మోతాదులో వాడాలని ఉద్యాన శాఖ సిఫార్సు చేసింది. అయితే అధిక దిగుబడిని ఆశించిన కొంతమంది రైతులు, లీజుదార్లు దీనిని పరిమితికి మించి పలుమార్లతో పాటు 20 ఏళ్ల లోపు చెట్లకు కూడా వినియోగిస్తున్నారు. వీరిలో రైతులకంటే లీజుదార్లే ఎక్కువగా ఉంటున్నారు. ఫలితంగా వీటి దుష్ప్రభావాలు అధికమవుతున్నాయి. సాధారణంగా మామిడి పూత ఆరంభానికి నాలుగైదు నెలల ముందు కల్తార్‌ను చెట్ల వేళ్ల, మొదలు నుంచి రెండు మీటర్ల ఎత్తు వరకు ఉన్న బెరడు, కొమ్మలకు స్ప్రే చేయాల్సి ఉంటుంది. 20 లీటర్ల నీటిలో 10 మి.లీల కల్తార్‌ను కలిపి చల్లాలి. ఇలా చేస్తే పూత సరైన సమయంలో వస్తుంది. సకాలంలో తొలికాపు చేతికొచ్చి మంచి ధర లభిస్తుంది.

అధిక వినియోగంతో అనర్థం

మామిడి చెట్టు 20 ఏళ్ల వరకు కాపు బాగానే ఉంటుంది. ఆ తర్వాత దిగుబడి తగ్గుతుంది. అలాంటి చెట్లకే కల్తార్‌ను స్ప్రే చేయడం ద్వారా 20 శాతం వరకు అధిక దిగుబడికి దోహదపడుతుంది. కానీ సీజనులో మూడు, నాలుగుసార్లు స్ప్రే చేస్తున్నారు. ఫలితంగా తాత్కాలికంగా ఇవి ఎక్కువ దిగుబడినిస్తున్నా వాటి జీవితకాలం తగ్గిపోవడమే కాదు.. కొన్ని చెట్లు చనిపోతున్నాయి. రైతుకు నష్టాన్ని మిగిలిస్తున్నాయి. మామిడి తోటలను కొనుగోలు చేసిన వ్యాపారులు/లీజుదార్లు రైతుకు తెలియకుండానే కల్తార్‌ను స్ప్రే చేస్తున్నారు. లీజు ముగిశాక కొన్ని చెట్లు చనిపోతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో లీజుదార్లు 60 శాతానికి పైగా కల్తార్ స్ప్రేకి అలవాటు పడినట్టు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



కల్తార్‌ను పరిమితంగా వినియోగించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కల్తార్ వినియోగం తప్పు కాదు. కానీ 20 ఏళ్ల పైబడిన మామిడిచెట్లకు, అదీ సీజనుకు ఒకసారే స్ప్రే చేయాలి. కానీ కొందరు అధిక దిగుబడులు ఆశించి పరిమితికి మించి ఎక్కువ డోస్‌లు వాడుతున్నారు. దీని వల్ల చెట్లు చనిపోయే ప్రమాదం ఉంటోంది. చెట్లకు రైతులు కల్తార్ స్ప్రే చేసి ఉన్నట్టయితే ఆ సంగతిని లీజుదారునికి ముందుగానే చెప్పాలని సూచిస్తున్నాం. దీంతో లీజుదారు మళ్లీ మళ్లీ స్ప్రే చేయకుండా నివారించవచ్చు. ఒకసారి కల్తార్ స్ప్రే చేసిన చెట్లకు నీరు, పోషకాలు ఎక్కువగా ఇవ్వాలి. నీటి సదుపాయం ఉన్న వారు కల్తార్ స్ప్రే చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

–పూసర్ల స్వాతి, ఉద్యానశాఖ అధికారి, భీమిలి

రూ.152 కోట్లతో ఏఎంసీలో వసతులు



ఏఎంసీలో జరుగుతున్న విద్యార్థుల వసతి గృహం పనులు(ఫైల్)

• తొలి విడతగా రూ.25 కోట్లు విడుదల
• ఇందులో రాష్ట్ర వాటా 40 శాతం
• చురుగ్గా సాగుతున్న వసతి గృహ పనులు

మహారాణిపేట: వందేళ్ల చరిత్ర గల ఆంధ్రా వైద్య కళాశాల(ఏఎంసీ)లో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. రూ.152 కోట్లతో సదుపాయాలు, వసతి గృహాల నిర్మాణం, కీలక వైద్య పరికరాల సమీకరణ, తదితర అభివృద్ధి పనుల కోసం రూపొందించిన డీపీఆర్‌కు కేంద్రం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.25 కోట్లు విడుదల చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతం. ఈ నిధులతో ప్రారంభించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా బలహీన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు చెందిన వారికి పీజీ సీట్లు కేటాయించడంతో.. ఆంధ్రా వైద్య కళాశాలలో పీజీ సీట్లు పెరిగాయి. మొత్తంగా 27 వైద్య విభాగాలకు 131 సీట్లు కేటాయించగా.. ఈ ఏడాది 101 సీట్లను కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా.. పీజీ సీట్లు పెరగడంతో కళాశాలలో మౌలిక సదుపాయాలు, వసతి గృహాల నిర్మాణం, కీలక వైద్య పరికరాల కోసం రూ.152 కోట్లతో రాష్ట్ర వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ, ఆంధ్ర వైద్య కళాశాల సంయుక్తంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) రూపొందించాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు జాతీయ వైద్య మండలి, కేంద్ర ఆరోగ్య శాఖ నిర్వహించిన సమావేశంలో ఈ డీపీఆర్‌ను సమర్పించారు. ఈ డీపీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధుల విడుదలకు మార్గం సుగమం అయింది. ఇందులో భాగంగా తొలి విడతలో రూ.25 కోట్లు విడుదలయ్యాయి. ఏఎంసీలో ప్రస్తుతం 38 వైద్య విభాగాల్లో 237 సీట్లు ఉన్నాయి. తాజాగా ప్రతిపాదించిన 131 సీట్లు కలిపితే ఆ సంఖ్య 368కి చేరుతుంది. ఈ నేపథ్యంలో రూ.23.38 కోట్లతో పీజీ వుమెన్ హాస్టల్, రూ.35.50 కోట్లతో మెన్ వసతి గృహం, రూ.12.50 కోట్లతో సీఎస్సార్ బ్లాక్(అదనపు అంతస్తు), రూ.4 కోట్లతో ఎస్ఎస్ బ్లాక్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించారు. తొలి విడతలో విడుదలైన నిధులతో తొమ్మిది అంతస్తులతో మెన్ హాస్టల్, ఏడు అంతస్తులతో వుమెన్ హాస్టల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం



కొత్తగా సమకూరే భవనాల్లో సమావేశ మందిరాలు, లెక్చర్ హాళ్లు ఏర్పాటు చేస్తాం. ఆపరేషన్ థియేటర్లలో వసతులు మెరుగుపరుస్తాం. జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) మార్గదర్శకాలను అనుసరించి వసతులు కల్పిస్తున్నాం. పందిమెట్ట ప్రాంతంలో విద్యార్థుల వసతి గృహాల నిర్మాణం ప్రారంభించాం. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం. – డాక్టర్ జి.బుచ్చిరాజు, ప్రిన్సిపాల్, ఏఎంసీ

లైంగిక దాడి కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

విశాఖ లీగల్: బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి మూడేళ్ల జైలు, రూ. 20 వేల జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి. ఆనందిని గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు కాసిం శెట్టి చిరంజీవిది అనకాపల్లి జిల్లా రావికమతం మండలం గర్నిక గ్రామం. వృత్తిరీత్యా వ్యవసాయదారుడు. బాధిత బాలిక 2018 జూలై 15న స్నేహితులతో కలిసి సమీపంలోని పాఠశాలకు వెళ్లింది. మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి వచ్చింది. ఆ సమయంలో బాలికను చినబాబుగారి చెరుకుతోటకు తీసుకొని వెళ్లాడు చిరంజీవి. అక్కడ బాలికపై లైంగిక దాడికి యత్నించగా ప్రతిఘటించింది. కేకలు వేయడంతో సమీపంలోని చిన్నారులు, గ్రామస్తులు అక్కడకు వచ్చారు. ఇంతలో నిందితుడు పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు రావికమతం పోలీసులు నిందితుడిపై సెక్షన్ 354, 354ఎ,354బి కింద కేసు నమోదు చేశారు. అలాగే బాధితురాలి వయసు 13 ఏళ్లు కావడంతో పోక్సో చట్టం సెక్షన్ 7 కింద కూడా కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

పలు అభివృద్ధి పనుల పరిశీలన



న్యూ గూడ్స్ షెడ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న డీఆర్ఎం అనూప్‌కుమార్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో గూడ్స్ షెడ్‌ల అభివృద్ధి పనితీరును ఆయన పర్యవేక్షించారు. దీనిలో భాగంగా విశాఖపట్నం న్యూ గూడ్స్ కాంప్లెక్స్, కంటకాపల్లి గూడ్స్ షెడ్‌లను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ప్రస్తుత పరిస్థితులను, అభివృద్ధి పరచాల్సిన సదుపాయాలను గుర్తించి వీటిపై అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో లోడింగ్, అన్‌లోడింగ్ సామర్థ్యం పెంపుకోసం అవసరమైన వనరులను సమకూర్చాలని తెలిపారు. ఈ పర్యటనలో డీఆర్ఎంతో పాటు వాల్తేర్ డివిజన్ ఆపరేషన్స్, కమర్షియల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

'మతతత్వ బీజేపీని గద్దె దించాల్సిందే..'



మాట్లాడుతున్న ఏజే స్టాలిన్

అల్లిపురం: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అవలంబిస్తున్న మతతత్వ విధానాలను ఎండగడుతూ.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దె దించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు ఏజే స్టాలిన్ పిలుపునిచ్చారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ సమితి సమావేశాలు గురువారం సీపీఐ కార్యాలయంలో జరిగాయి. పార్టీ పరంగా జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే దేశం విపత్కర పరిస్థితుల్లోకి వెళ్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యురాలు అత్తిలి విమల, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎస్.కె.రెహమాన్, జి.రాంబాబు, ఆర్.శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్, సి.ఎస్.క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ హత్య

• భూతగాదాయే కారణమంటున్న పోలీసులు
• అనకాపల్లి జిల్లాలో ఘటన



ఘటనాస్థలిలో మృతుడు కన్నబాబు

అనకాపల్లి టౌన్ : భూ తగాదా విషయంలో ఇద్దరు రౌడీషీటర్ల మధ్య జరిగిన ఘర్షణ ఓ రౌడీషీటర్ ప్రాణాలు తీసింది. అనకాపల్లి మండలం ఊడేరు రహదారిని ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో గురువారం తెల్లవారుజామున మృతదేహం లభ్యమైంది. మృతుడు రౌడీషీటర్ కన్నబాబుగా పోలీసులు గుర్తించారు. ఆయనపై గతంలో విశాఖ నగరంలో ఒక కిడ్నాప్ కేసు, ఒక హత్య కేసు, భూ సెటిల్‌మెంట్ వివాదంలో పలు కేసులున్నట్లు పోలీసులు చెబుతున్నారు. దీంతో విశాఖ పోలీసులు పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చి నగరాన్ని వదిలి వెళ్లిపోవాలని, లేదంటే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో 2021లో విశాఖ నగరాన్ని వదిలి అనకాపల్లికి వెళ్లినట్లు పోలీసులు చెబుతున్నారు. అనకాపల్లి టౌన్ గాంధీనగరంలో రౌడీషీటర్ కన్నబాబు, తమ్ముడు శివరామకృష్ణ లిద్దరూ తమ తల్లితో జీవిస్తున్నారు. రౌడీషీటర్ కన్నబాబును బుధవారం ఉదయం 10 గంటలకు తన స్నేహితుడైన మరో రౌడీషీటర్ బైక్‌పై తీసుకుని వెళ్లాడు. ఉదయం వెళ్లిన కన్నబాబు రాత్రి 8.30 గంటలైనా ఇంటికి రాకపోవడంతో ఆయన తమ్ముడు కన్నబాబు సెల్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అయితే గురువారం అనకాపల్లి మండలం ఊడేరు గ్రామ సమీపంలో ఓ లేఅవుట్ వద్ద అన్న హత్యకు గురైనట్లు తెలుసుకున్న శివరామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతుడితో సన్నిహితంగా ఉన్న మరో రౌడీషీటర్ సురేంద్రతో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇటీవల ఒక ల్యాండ్ సెటిల్‌మెంట్ జరగ్గా.. పంపకాల్లో తేడా వచ్చినందుకే హత్యచేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

స్వామీజీని ఆశ్రమం నుంచి బహిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామ పెద్దలు

ఎంవీపీకాలనీ: బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన పూర్ణానంద స్వామీజీ(పున్నయ్య)ని జ్ఞానానంద ఆశ్రమం నుంచి బహిష్కరించాలని వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గ్రామ సేవా సంఘం కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ 80 ఏళ్ల చరిత్ర కలిగిన జ్ఞానానంద ఆశ్రమాన్ని స్వామీజీ అప్రతిష్టపాలు చేశారన్నారు. ఇద్దరు దాతలు విలువైన ఆరు ఎకరాల భూమిని అందజేస్తే.. గ్రామ సంఘం సహాయంతో అప్పట్లో ఆశ్రమంతో పాటు మూడు ఆలయాలు నిర్మించినట్లు చెప్పారు. పూర్ణానంద స్వామీజీ తొలి నుంచి ఆశ్రమం పరువు తీస్తున్నారన్నారు. 2012లోనూ ఇలాంటి కేసులో స్వామీజీ నిందితుడిగా నిలిచారన్నారు. అక్రమాలను ప్రశ్నిస్తున్నామనే నెపంతో గ్రామస్తులను ఆశ్రమానికి దూరం చేశారన్నారు. పలు సందర్భాల్లో ఆయన తీరును ప్రశ్నించిన గ్రామ సేవా సంఘం పెద్దలపై కేసులు కూడా పెట్టారన్నారు. కలెక్టర్, పోలీసు కమిషనర్ చొరవ తీసుకుని ఆయన్ని శాశ్వతంగా ఆశ్రమం నుంచి బహిష్కరించాలని, మిగిలిన సిబ్బంది, విద్యార్థులకు రక్షణ కల్పించాలని కోరారు. సంఘం అధ్యక్షుడు మద్దాల వీరవెంకట అప్పారావు, మాజీ అధ్యక్షుడు కాళ్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రింగు వలలతో వేట నిషేధం.. సహకరించండి

మత్స్యకారులకు జేడీ విజ్ఞప్తి



మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ విజయ

కొమ్మాది: నిషేధిత రింగు వలలతో వేట నిలిపివేయాలని, ఈ విషయంలో మత్స్యకారులు సహకరించాలని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయ కోరారు. మంగమారిపేటలోని సామాజిక భవనంలో గురువారం మత్స్య, పోలీస్ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రింగు వలలతో వేట నేపథ్యంలో గతంలో అనేక సమస్యలు నెలకొన్నాయని.. అవి మరలా పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ప్రస్తుతం రింగు వలల సమస్య కోర్టు పరిధిలో ఉందని, అందువల్ల ఏ ఒక్క మత్స్యకారుడూ రింగు వలలతో వేటకు వెళ్లకూడదన్నారు. మొన్నటి వరకు రుషికొండ నుంచి సాగర్‌నగర్ బీచ్ వరకు రింగు వలలు ఉపయోగించడానికి అనుమతి ఇచ్చామని.. ప్రస్తుతం అక్కడ కూడా పూర్తిస్థాయిలో నిషేధించినట్లు చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు కృషి చేస్తున్నట్లు వివరించారు. అయితే దీనిపై మత్స్యకారులు ముందు ససేమిరా అన్నా.. అధికారులు నచ్చజెప్పడంతో ప్రస్తుతానికి రింగు వలలతో వేటకు వెళ్లమని చెప్పారు. సమావేశంలో ఏడీఎఫ్ ఎం.విజయకృష్ణ, మెరైన్ డీఎస్పీ కాళిదాసు, ఎఫ్‌డీవో డి.లావణ్య, మెరైన్ సీఐ జి. శ్రీనివాస్, ఎస్ఐ మురళీకృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు.. రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు భద్రతాపరమైన పనుల నిమిత్తం పలు రైళ్లు రద్దు చేసినట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

హౌరాలో శుక్రవారం బయల్దేరాల్సిన హౌరా–మైసూరు (22817) ఎక్స్‌ప్రెస్, మైసూరులో ఈ నెల 25న బయల్దేరాల్సిన మైసూరు - హౌరా(22818) ఎక్స్‌ప్రెస్, షాలిమార్‌లో శుక్రవారం బయల్దేరాల్సిన షాలిమార్–హైదరాబాద్(18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్‌లో శుక్రవారం బయల్దేరాల్సిన హైదరాబాద్–షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చిలో శుక్రవారం బయల్దేరాల్సిన సంత్రగచ్చి–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22807) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో ఈనెల 25న బయల్దేరాల్సిన ఎంజీఆర్ చెన్నైసెంట్రల్ - సంత్రగచ్చి(22808) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దు. సికింద్రాబాద్‌లో శుక్రవారం బయల్దేరాల్సిన సికింద్రాబాద్–షాలిమార్ (22850) ఎక్స్‌ప్రెస్, అగర్తలాలో శుక్రవారం బయల్దేరాల్సిన అగర్తలా– సికింద్రాబాద్ (07029) ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్...

గురువారం ఉదయం 8.50 గంటలకు బెంగళూరులో బయల్దేరాల్సిన బెంగళూరు–హతియా (12836) ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా ఉదయం 10.30 గంటలకు బయల్దేరింది. గురువారం ఉదయం 10.35 గంటలకు బెంగళూరులో బయల్దేరాల్సిన బెంగళూరు–హౌరా (12864) ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరింది. గురువారం మధ్యాహ్నం 3.20 గంటలకు షాలిమార్‌లో బయల్దేరాల్సిన షాలిమార్ – చెన్నై సెంట్రల్ (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు ఆరున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 9.40 గంటలకు బయల్దేరింది.

పలు రైళ్లు దారి మళ్లింపు

• ఈస్టర్న్ రైల్వే ఖరగ్‌పూర్ డివిజన్ డంకుని–ఖరగ్‌పూర్ సెక్షన్ మధ్య జరుగుతున్న పలు అభివృద్ధి పనుల నిమిత్తం ఆయా తేదీల్లో పవర్ కం ట్రాఫిక్ బ్లాక్ తీసుకుంటున్నందున ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు వయా డంకుని, హౌరా, ఖరగ్‌పూర్ మీదుగా రాకపోకలు సాగించనున్నాయని రైల్వే అధికారులు తెలిపారు.
• గురు,శుక్రవారాలు, జూలై 1,2,4 తేదీల్లో డిబ్రూఘడ్‌లో బయల్దేరే డిబ్రూఘడ్– కన్యాకుమారి (22504)ఎక్స్‌ప్రెస్,
• జూలై 2,3,4 తేదీల్లో గౌహతిలో బయల్దేరే గౌహతి–ఎస్ఎంవీ బెంగళూరు (12510) ఎక్స్‌ప్రెస్, జూలై 4న సిల్చార్‌లో బయల్దేరే సిల్చార్ – కోయంబత్తూర్ (12516) ఎక్స్‌ప్రెస్, గురువారం బయలుదేరిన సిల్చార్‌లో బయల్దేరే సిల్చార్ –త్రివేంద్రం (12508) ఎక్స్‌ప్రెస్, గురువారం గౌహతిలో బయల్దేరిన గౌహతి - సికింద్రాబాద్(12514) ఎక్స్‌ప్రెస్, జూన్ 23, 30 తేదీల్లో న్యూ టిన్‌సుకియాలో బయల్దేరే న్యూ టిన్‌సుకియా - ఎస్ఎంవీ బెంగళూరు (22502) ఎక్స్‌ప్రెస్‌లు రెగ్యులర్ మార్గంలో కాకుండా మళ్లించిన మార్గంలో వయా డంకుని, హౌరా, ఖరగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తాయి.